క్లుప్తంగా

నీట్‌పై చర్చా వేదిక నేడు

నెల్లూరు(అర్బన్‌): నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు నీట్‌పై చర్చా వేదికను నిర్వహించనున్నట్లు జనవిజ్ఞానవేదిక కార్యదర్శి పోతంశెట్టి విద్యాచరణ్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య విద్యలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్‌ ఎంట్రెన్స్‌ టెస్ట్‌ నిర్వహణలో చోటు చేసుకున్న అవకతవకల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయాలా.. వద్దా..అనే అంశంపై చర్చావేదిక నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని కోరారు.

27న పది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని మూలాపేట, పత్తేఖాన్‌పేట, మన్సూర్‌నగర్‌, తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు అన్నదేవుల గోవిందురెడ్డి సరస్వతి సమాజం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ఆ సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఉదయం 10గంటలకు సమాజం ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సన్మానించనున్నట్లు తెలిపారు.

ఆలయ భూములకు కౌలు వేలం



తోటపల్లిగూడూరు : నెల్లూరు నవాబుపేటలో ఉన్న సీతారామాంజనేయస్వామి ఆలయ భూముల కౌలు వేలంపాటను మంగళవారం నిర్వహించారు. ఆలయానికి సంబంధించి మండలంలోని చింతోపు పంచాయతీ పరిధిలో 7.99 ఎకరాల మాగాణి భూమి ఉంది. ఈ భూములకు సంబంధించి మూడేళ్ల కాలపరిమితికి సోమవారం చింతోపులోని ఆంజనేయస్వామి ఆలయంలో దేవదాయ శాఖాధికారులు కౌలు వేలం పాటలు నిర్వహించారు. స్థానిక రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా కొత్తూరుకు చెందిన లేబూరు వెంకురెడ్డి అనే రైతు ఏడాది కాలానికి రూ.3,46,100 కౌలు చెల్లించేలా మూడేళ్లకు ఆలయ భూములను దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కవిత, స్థానిక గ్రామ పెద్దలు కైలాశం ఆదిశేషారెడ్డి, నెల్లూరుబాకు శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వలపై టీఏలకు శిక్షణ



కొడవలూరు : ధాన్యం, పప్పు దినుసులు పురుగు పట్టకుండా నిల్వ ఉంచడంపై నూతన టీఏలకు మండలంలోని చంద్రశేఖరపురం పౌరసరఫరాల శాఖ గిడ్డంగుల్లో సోమవారం శిక్షణ ఇచ్చారు. పౌరసరఫరాల శాఖ ఇటీవల 11 మంది టెక్నికల్‌ అసిస్టెంట్‌లను కాంట్రాక్ట్‌ బేసిక్‌లో నియమించింది. వీరికి ధాన్యం, అపరాలు నిల్వ ఉంచడంపై సంబంధిత అధికారులు శిక్షణ ఇచ్చారు. వారానికోసారి నిర్దేశించిన మందులను ధాన్యం, అపరాల నిల్వలపై స్ప్రే చేయడం ద్వారా పురుగు ఆశించకుండా ఉంటుందని శిక్షణలో టీఏలకు వివరించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ టెక్నికల్‌ ఏఎం లక్ష్మీనారాయణ, గిడ్డంగి మేనేజర్‌ ఎఫ్‌.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



ముత్తుకూరు : రక్తదానం ప్రాణదానంతో సమానమని అదాని కృష్ణపట్నం పోర్టు సీఈఓ జీజే రావు అన్నారు. రెడ్‌క్రాస్‌ సహకారంతో పోర్టులో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం చాలా విలువైనదని, ధనంతో కొనలేనిదని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి, ఆదుకోవడం మానవత్వమని చెప్పారు. రక్తదానం చేసి విలువైన ప్రాణాలు రక్షించడమే కాకుండా ఒక కుటుంబాన్ని ఆదుకున్నామన్న సంతృప్తి లభిస్తుందన్నారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన 283 మందికి ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. సీఓఓ రాజన్‌బాబు, అడ్మిన్‌హెడ్‌ గణేష్‌శర్మ, ఈహెచ్‌ఎస్‌ ఏజీఎం వేణుగోపాలరెడ్డి, సెక్యూరిటీ హెడ్‌ వెంకటేష్‌భాస్కరన్‌, మనీష్‌ దావే, మృత్యుంజయరామ్‌, గుడివాడ శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు



సమావేశానికి హాజరైన అధికారులు, సిబ్బంది



మాట్లాడుతున్న కమిషనర్‌ వికాస్‌మర్మత్‌

- కార్పొరేషన్‌ కమిషనర్‌ వికాస్‌మర్మత్‌

నెల్లూరు(బారకాసు): డయేరియా ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్‌ కమిషనర్‌ వికాస్‌మర్మత్‌ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌ ఆదేశాల మేరకు కార్పొరేషన్‌ ఇంజినీరింగ్‌, ప్రజారోగ్య విభాగాల అధికారులు, సచివాలయ కార్యదర్శులతో డయేరియా నివారణపై సమావేశాన్ని కమాండ్‌ కంట్రోల్‌ సెంటర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ కార్పొరేషన్‌ పరిధిలోని ఇంటింటికి వెళ్లి పరిశుభ్రమైన నీరు తాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగేలా, పరిసరాల, వ్యక్తిగత శుభ్రతను పాటించేలా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. డయేరియా లక్షణాలను గుర్తించిన ప్రాంతాల్లో తాగునీటిని పరీక్షించాలని సూచించారు. తాగునీరు కలుషితమై ఉంటే వెంటనే మంచినీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్పొరేషన్‌ పరిధిలోని అన్ని డివిజన్లలో క్రమం తప్పకుండా ఓవర్‌ హెడ్‌ వాటర్‌ ట్యాంక్‌ నుంచి సరఫరా అయ్యే తాగునీటి ప్రమాణాలను పరీక్షించి నివేదికలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. వాటర్‌ ట్యాంకులను ప్రతి పదిహేనురోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. తాగునీటి క్లోరినేషన్‌ ప్రక్రియను క్రమం తప్పకుండా అమలు చేయాలన్నారు. ట్యాంకు పరిసరాల్లో మురుగు నిల్వ లేకుండా చూడడంతో పాటు బ్లీచింగ్‌ చేయాలన్నారు. మంచినీటి పైపుల లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ కాలువలకు సమాంతరంగా ఉన్న మంచినీటి పైప్‌లైన్లను గుర్తించి పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని యూనిట్‌గా చేస్తూ సచివాలయం అమెనిటీస్‌, హెల్త్‌ కార్యదర్శులను బృందంగా ఏర్పాటు చేసి డయేరియా లక్షణాలను కలిగిన కుటుంబాల వివరాలను గుర్తించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నగర వ్యాప్తంగా ఉన్న ప్రజా మరుగుదొడ్ల నిర్వహణపై ఇంజినీరింగ్‌ విభాగం అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. పరిశుభ్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌ఈ సంపత్‌కుమార్‌, హెల్త్‌ ఆఫీసర్‌ వెంకటరమణ, రమేష్‌, సిటీప్లానర్‌ దేవీకుమారీ, డాక్టర్‌ జీజియాభాయి, మెడికల్‌ ఆఫీసర్లు, ఇంజినీరింగ్‌, శానిటేషన్‌ విభాగాధికారులు, సచివాలయ అమెనిటీస్‌, హెల్త్‌ విభాగ కార్యదర్శులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్‌ డీఎస్పీ బదిలీ

–ఇన్‌చార్జి డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి



డీఎస్పీ వీరాంజనేయరెడ్డి

నెల్లూరు(క్రైమ్‌): నెల్లూరు రూరల్‌ డీఎస్పీ పీ వీరాంజనేయరెడ్డిని తక్షణమే పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. వెంటనే ఆయన్ని విధులనుంచి రిలీవ్‌ చేయాలని ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్‌ను ఆదేశించారు. దీంతో నెల్లూరు రూరల్‌ ఇన్‌చార్జి డీఎస్పీగా నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డిని నియమించారు.

సమర్థవంతంగా విధులు

నెల్లూరు రూరల్‌ డీఎస్పీగా పీ వీరాంజనేయరెడ్డి 2022 నవంబర్‌ 26న బాధ్యతలు స్వీకరించారు. సబ్‌డివిజన్‌ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో తనదైన ముద్ర వేశారు. ఎన్నో క్లిష్టతరమైన కేసులను ఛేదించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించారు.

కక్ష సాధింపు చర్యలు, దాడులు సరికావు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీపై కక్ష సాధింపు చర్యలు, హింసాత్మక దాడులకు పాల్పడడం సరికాదని వైఎస్సార్‌సీపీ నాయకులు, రాష్ట్ర మాల మహానాడు వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ స్వర్ణ వెంకయ్య, రాష్ట్ర బీసీ సెల్‌ కార్యదర్శి హరిబాబుయాదవ్‌, కార్పొరేటర్‌ బొబ్బల శ్రీనివాస్‌ యాదవ్‌ అన్నారు. నగరంలోని మినీబైపాస్‌లోని రూరల్‌ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామన్నారు. ఎన్నికల విజయాన్ని గొప్ప బాధ్యతగా తీసుకుని ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా మంచి పనులు చేయాలని టీడీపీ నాయకులకు సూచించారు. రూరల్‌ ఎమ్మెల్యేగా మూడోసారి గెలుపొందిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నెల్లూరు రూరల్‌ ప్రజలకు మేలు చేకూర్చే పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ తరఫున తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామన్నారు. ప్రజలు ఇచ్చిన గొప్ప విజయాన్ని కాదని ప్రజాస్వామ్యంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారుల పైన దాడులు, బెదిరింపులకు పాల్పడడం మంచి సంప్రదాయం కాదన్నారు. మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిపైన కొందరు టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు అసత్య ఆరోపణలు చేస్తూ బురదజల్లడం సరికాదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్‌ అధ్యక్షులు పాలకీర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎంపీ వేమిరెడ్డి కుటుంబ సభ్యులు



నెల్లూరు(దర్గామిట్ట):పార్లమెంట్‌లో నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి వేమిరెడ్డి సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, తనయుడు అర్జున్‌రెడ్డి, కుటుంబ సభ్యులు హనీష్‌, డిప్యూటీ మేయర్‌ రూప్‌కుమార్‌యాదవ్‌, తదితరులు హాజరయ్యారు.

వైద్యశాఖలోని సమస్యలను పరిష్కరించండి



మంత్రికి మొక్కను అందజేస్తున్న ఎన్జీఓ అసోసియేషన్‌ నాయకులు

నెల్లూరు(అర్బన్‌): అమరావతిలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్యవిద్యా శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను ఏపీ ఎన్జీఓ అసోసియేషన్‌ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వైద్యశాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్‌ కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, సతీష్‌ తదితరులు పాల్గొన్నారు.

మరో పది మంది విద్యార్థులకు డయేరియా

నెల్లూరు(అర్బన్‌): తిరుపతి జిల్లా గూడూరు రూరల్‌ మండలం చెన్నూరులో గిరిజన వసతిగృహానికి చెందిన మరో పది మంది విద్యార్థులు డయేరియాకు గురయ్యారు. వారిని నెల్లూరులోని ప్రభుత్వ జిల్లా సర్వజన వైద్యశాలకు సోమవారం రాత్రి తరలించారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్‌ అధికారి డాక్టర్‌ కళారాణి విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిని పరిశీలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కాగా చెన్నూరు వసతి గృహంలో మూడు రోజుల క్రితం డయేరియా ప్రబలింది. ఇప్పటికే ఆరుగురు జయభారత్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విద్యార్థులు డయేరియా బారిన పడడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విశ్వనాథునికి రుద్రాభిషేకం

మనుబోలు : మండలంలోని చెర్లోపల్లి రైల్వే గేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. దివంగత బొమ్మిరెడ్డి అఖిలేష్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి యువరాణి కుమారుడు భవదీప్‌ ఉభయకర్తగా వ్యవహరించారు.

ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించండి

- కమిషనర్‌ వికాస్‌మర్మత్‌



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్‌ వికాస్‌మర్మత్‌

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్పొరేషన్‌ కార్యాలయంలోని కమాండ్‌ కంట్రోల్‌ విభాగ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్‌ వికాస్‌మర్మత్‌ పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల అనంతరం తొలిసారిగా ప్రజా వేదికను నిర్వహిస్తున్నామని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన, స్థలాలు, కాలువలపైన ఆక్రమణలు, జగనన్న కాలనీ, టిడ్కో గృహాల కేటాయింపు, కచ్చా కాలువలు, డ్రైనేజీ సౌకర్యాలు, మంచినీటి కల్వర్టులు, నూతన రోడ్ల నిర్మాణం, ప్యాచ్‌వర్క్‌ పనులు వంటి అంశాలపై ప్రజావేదికలో అందుకున్న సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలపు సమస్యలను అధిగమించేందుకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మొత్తం 30 అర్జీలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 30 వినతులు అందాయి. అందులో విభాగాల వారీగా రెవెన్యూ 1, ఇంజినీరింగ్‌ 6, టౌన్‌ప్లానింగ్‌ 9, హౌసింగ్‌ 5, పబ్లిక్‌ హెల్త్‌ 1, అకౌంట్స్‌ 6, ఆప్కాస్‌ 2 చొప్పున అర్జీలు వచ్చాయి. అందుకున్న వినతులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్‌ సంబంధిత విభాగాల అధికారులకు సూచించారు. ఇంజినీరింగ్‌ విభాగం ఎస్‌ఈ సంపత్‌కుమార్‌, హెల్త్‌ఆఫీసర్‌ డాక్టర్‌ వెంకటరమణ, సిటీప్లానర్‌ దేవీకుమారితో పాటు ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్‌ డే



గాంధీనగర్‌ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సర్టిఫికెట్ల ప్రదానం



శివాజీనగర్‌ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సర్టిఫికెట్ల ప్రదానం

నెల్లూరు సిటీ: రూరల్‌ నియోజకవర్గం, చైతన్యపురిలోని గాంధీనగర్‌ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్‌ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్‌ సుజాత ఆధ్వర్యంలో ప్రీస్కూల్‌ విద్యను పూర్తి చేసుకుని ఒకటో తరగతిలో చేరుతున్న చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం అంగన్‌వాడీ బడిబాట, గ్రాడ్యుయేషన్‌ డే, హ్యాండ్‌వాష్‌, సీజనల్‌ వ్యాధులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు నీరజ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌): ఐసీడీఎస్‌ నెల్లూరు అర్బన్‌ ప్రాజెక్ట్‌ పరిధిలోని రంగనాయకులపేట సెక్టార్‌లో ఉన్న శివాజీనగర్‌ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్‌ డేను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్‌ ఏసీడీపీఓ లక్ష్మీదేవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్‌ విద్యలో భాగంగా మూడేళ్లు నిండిన చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఐదేళ్లు నిండిన తరువాత సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తున్నామని వివరించారు. అందులో భాగంగా ప్రీస్కూల్‌ పూర్తి చేసుకున్న ఐదేళ్లు నిండిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేసి సమీపంలోని పాఠశాలల్లో చేర్పిస్తున్నామని తెలిపారు. అనంతరం దోమలతో వ్యాప్తి చెందే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల శుభ్రత, పరిశుభ్రమైన నీటిని ఆహారం, నీటిని తీసుకోవడం, డయేరియా వ్యాధిపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మాధవి, అరుణ, శ్యామల, ప్రసన్న, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి ఒకరు తోడుగా..



వారంతా అంధులు..తమ సమస్యల పరిష్కారం కోసం ఇతరుల సాయం ఆశించలేదు. ఒకరికి ఒకరు తోడుగా సోమవారం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఒకరి చేయి ఒకరు పట్టుకుని అడుగులో అడుగు వేసుకుంటూ తిరిగి వెళ్లారు.

–సాక్షి, ఫొటోగ్రాఫర్‌

వైభవంగా కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం



అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న మహాలక్ష్మి,గోదా సమేత గురువాయూరు మహావిష్ణు మందిరంలో పుష్కర మహాసంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రోక్షణ, రక్షాబంధనం, మూలమూర్తికి అష్టోత్తర శతకలశాభిషేకం, ద్వార తోరణం, మహాకుంభారాధన, మండల ప్రతిష్ఠ ఆరాధన, చతుష్కుండాలతో హోమాలు, పూర్ణాహుతి, మంగళహారతి, శాత్తుమొరై, తదితర పూజాకార్యక్రమాలను కేరళ సంప్రదాయంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ద్వారతోరణ,చక్రాబ్జ, మహాకుంభారాధన, చతుష్కుండములతో హోమాలు, నివేదన, శాత్తుమొరై, తీర్థప్రసాదగోష్ఠి నిర్వహించారు. స్వామి అయ్యప్ప సేవా సమాజం నిర్వాహకులు గూడల శేషగిరిరావు, వెంకటరత్నం, రత్నయ్య, మోహన్‌రావు, శంకరన్‌ తదితరులు పర్యవేక్షించారు.

విశ్రాంత అధ్యాపకుల ఆత్మీయ సమావేశం



నెల్లూరు (టౌన్‌): నగరంలోని మినర్వాగ్రాండ్‌లో వీఆర్‌ కళాశాల విశ్రాంత భౌతికశాస్త్ర అధ్యాపకుల ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. వీఆర్‌ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్‌ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రచయిత మల్లికార్జునరెడ్డి రచించిన ది రేషనల్‌ సోలార్‌ క్యాలెండర్‌ పుస్తకాన్ని విశ్రాంత అధ్యాపకులు ఆవిష్కరించారు. తిథులు, వారాల పేర్లు, సంవత్సరంలో రోజుల సంఖ్య మొదలైన అంశాలపై చిన్నప్పటి నుంచి కలిగిన సందేహాలపై పరిశోధన చేసి పుస్తకాన్ని ప్రచురించినట్లు మల్లికార్జునరెడ్డి తెలిపారు. సీనియర్‌ విశ్రాంత అధ్యాపకులు కోదండరామిరెడ్డి మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన వీఆర్‌ కళాశాల ఇప్పుడు నిర్వీర్యంగా మిగలడం బాధాకరమన్నారు. తొలుత పూర్వ అధ్యాపకురాలు సరోజను ఆమె ఇంటివద్ద కలిసి సన్మానించారు. ఈ సమావేశంలో విశ్రాంత అధ్యాపకులు నరసారెడ్డి, సుందర్‌జాకబ్‌, రవీంద్ర, హరిప్రసాద్‌, వేమారెడ్డి, కృష్ణమోహన్‌, రంగారెడ్డి, సాబ్జాన్‌, అధ్యాపకులు కృష్ణశర్మ, రవిప్రసాద్‌, హరనాథ్‌, బోధనేతర సిబ్బంది కోటేశ్వరరావు, చెంచయ్య, శ్రీనివాసకుమార్‌, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవి ఆలయానికి టీవీ బహూకరణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయానికి ప్రత్తి రామకృష్ణ సోమవారం టీవీని బహూకరించారు. సీసీకెమెరాల ద్వారా క్యూలైన్ల పర్యవేక్షణకు ప్రత్తి సరళ జ్ఞాపకార్థంగా ఆలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు మాలేపాటి చైతన్య, పద్మజ చేతుల మీదుగా ఆయన టీవీని అందజేసినట్లు ఈఓ జే వెంకటసుబ్బయ్య తెలిపారు.

బ్యాంకు సేవలను సరళతరం చేయాలి



ఫెడరల్‌ బ్యాంకు నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

నెల్లూరు(అర్బన్‌): పేదలందరికీ ఫెడరల్‌ బ్యాంకు సేవలు అందేలా లక్ష్యాలను సరళతరం చేయాలని నెల్లూరు జిల్లా డైరెక్టర్‌ ట్యాక్స్‌ బార్‌ అసోసియేషన్‌ మాజీ అధ్యక్షుడు కొంజేటి శ్రీనివాసులు అన్నారు. వేదాయపాళెంలోని నిప్పో ఫ్యాక్టరీ సమీపంలో ఫెడరల్‌ బ్యాంక్‌ రెండో బ్రాంచ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టమర్లకు తక్కువ వడ్డీకే రుణాలు అందజేయడంతో పాటు డిపాజిట్లు సేకరించడం, తదితర సేవలు అందించడంలో ఫెడరల్‌ బ్యాంకు ముందుందన్నారు. బ్యాంకు ఏరియా హెడ్‌ స్వాతి మాట్లాడుతూ తిరుపతి క్లస్టర్‌ పరిధిలోని 14వ బ్రాంచ్‌ను వేదాయపాళెంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. విస్తరిస్తున్న నెల్లూరు నగరాన్ని దృష్టిలో ఉంచుకుని రెండో బ్రాంచ్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. త్వరలోనే మూడో బ్రాంచ్‌ ఏర్పాటు చేస్తామన్నారు. కస్టమర్ల నమ్మకాన్ని కాపాడుతూ బ్యాంకు సేవలను అందిస్తామన్నారు. బ్రాంచ్‌ మేనేజర్‌ ప్రవీణ్‌, భారతి విద్యాభవన్‌ అసోసియేట్‌ సెక్రటరీ సుమతిబాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపంతో...



రెండ్రోజులుగా భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఎండ వేడికి మనుషులతో పాటు మూగజీవాలు సైతం అల్లాడుతున్నాయి. చెట్ల కిందకు చేరి సేదతీరుతున్నాయి. ఇలా మూగజీవాల గుంపు సోమవారం మధ్యాహ్నం వేళ నగరంలోని ఓ చోట చెట్టు కింద సేదతీరుతూ కనిపించాయి. –సాక్షి, ఫొటోగ్రాఫర్‌